క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో కూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేద రోగికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: గుండె సంబంధిత వ్యాధితో పాటు పేదరికంతో బాధపడుతున్న వయోవృద్ధుడు కలిదిండి సత్తిరాజుకి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ప్రకటించిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు. సత్తిరాజు మొగల్తూరు మండలం కోమటితిప్ప గ్రామంలో పంటకాలువ గట్టున చిన్నగుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అతని వయస్సు 85 సంవత్సరాలు. భార్య సుందరమ్మ వారి ఆర్థిక పరిస్థితిని కన్వీనర్ బుద్ధరాజు దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి చైర్మన్ వెంకట్రామరాజుకి పరిస్థితి వివరించడంతో ఆయన వెంటనే రూ.10 వేలు ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయాన్ని సత్తిరాజు భార్య సుందరమ్మకు కన్వీనర్ బుద్ధరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు ప్రసాదరాజు పాల్గొన్నారు.

నేడు లేసు ట్రేడ్ సెంటర్‌లో చేనేత దినోత్సవం

నరసాపురం రూరల్: చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులకు స్థానిక అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్‌లో సత్కారాలను ఏర్పాటు చేశారు. సోమవారం అంతర్జాతయ లేసు ట్రేడ్ సెంటర్ (ఐఎస్‌టీసీల)లో నిర్వాహకుడు కలవకొలను తులసీరావు ఆధ్వర్యంలో చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. 1905 సంవత్సరంలో స్వాతంత్ర్య సమరం తీవ్రంగా జరుగుతున్న రోజుల్లో ఆగస్టు 7న విదేశీ దుస్తులు బహిష్కరించాలని, స్వదేశీదుస్తులు ధరించాలని పశ్చిమ బెంగాల్ రాజధానిలో ఈ ఉద్యమం చేపట్టారు. అప్పటి నుంచి ఆగస్టు7న చేనేత దినోత్సవం నిర్వహించారు. అయితే నరసాపుం చేనేతలకు పెట్టింది పేరు. ఇక్కడ చేయి తిరిగిన నేతగాళ్లకు కొదవ లేదు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా కూడా ఇక్కడ చేనేత కార్మికులకు ఆర్థిక సాయం అందుతుంది. పట్టణంలోని సాయిబాబా గుడి వద్ద, వనువులమ్మ గుడి ప్రాంతం, వీవర్స్ కాలనీలలోనూ నేతన్నల ఇళ్లు ఉన్నాయి.

మెకానిక్ షాపు దగ్ధం

నరసాపురం రూరల్: పట్టణంలోని స్టీమర్ రోడ్డులో సబ్‌జైల్ సమీపంలోని బైక్‌మెకానిక్ షాపులో ఆదివారం ఉదయం ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే వచ్చిన నరసాపురం ఫైర్ సిబ్బంది మంటను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మూడు బైక్‌లు దగ్ధం కావడంతో పాటు అక్కడే ఉన్న రామాలయానికి సంబంధించిన రథం పైకప్పుకూడా ఆహుతైంది. ఫైర్ ఆఫీసర్ భాస్కరరామం మాట్లాడుతూ మెకానిక్ షాపు పై నుంచి వెళుతున్న విద్యుత్ లైన్లు కలయిక వల్ల వచ్చిన మంటలతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. రూ.2.25 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

కుమారుడు కనిపించడం లేదంటూ ఫిర్యాదు

సాక్షి, భీమవరం: తన కుమారుడు కనిపించడం లేదంటూ భీమవరం పట్టణం నర్సయ్య అగ్రహారానికి చెందిన కె.వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సయ్య అగ్రహారానికి చెందిన సత్యనారాయణ కుమారుడు సోమేంద్ర వెంకట సతీష్ హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోమ్ డ్యూటీలో ఉన్న సతీష్ శనివారం రాత్రి యథావిధిగా తన రూమ్‌లో నిద్రపోయాడు. ఆదివారం ఉదయం గదిలో సతీష్ కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేక పోయింది. అతని గదిలో తనకు బతకాలని లేదంటూ చనిపోతానంటూ రాసిన సూసైడ్ నోట్ కనిపించడంతో కంగారుపడిన తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఉండి: పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం ఉంటారని యండగండి సర్పంచ్ గోగులమండ చిన కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తాల సుజాతారాణి, సీడీపీఓ వాణీ విజయనిర్మల, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్వాడీ వర్కర్లు మానుకొండ మరియమ్మ, చాపల ఎలీషా, రామలక్ష్మి పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలు భేష్

యలమంచిలి: వరదలు, తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని త్రికరణ శుద్ధిగా అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు సఫలీకృతులయ్యారు. గత నెల 21న ప్రారంభమైన గోదావరి వరద 13 రోజులుపాటు ఉండి ఈ నెల 2న పూర్తిగా తగ్గింది. ఈ 13 రోజుల్లో 10 రోజులు కేవలం రెండు గ్రామాలకే కనకాయలంక, పెదలంక గ్రామాలకే పరిమితమవ్వగా మూడు రోజులు మాత్రం మరొక 11 గ్రామాలు కంచుస్తంభంపాలెం, బూరుగుపల్లి, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం, నారినమెరక, శిరగాలపల్లి, ఏనుగువానిలంక, బాడవ గ్రామాలు వరద తాకిడికి గురయ్యాయి. వరద పెద్దగా రాకపోయిన సహాయం అందించడంలో మాత్రం ప్రభుత్వం అపూర్వంగా స్పందించింది.



దొడ్డిపట్ల పునరావాస కేంద్రంలో భోజనాలు చేస్తున్న వరద బాధితులు

4235 కుటుంబాలకు లబ్ధి

వరద ఉన్న సమయంలోనే వరద ప్రభావానికి గురయిన 4235 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు, కిలో వంట నూనె, పావు కిలో పచ్చిమిర్చి అందజేశారు. అంతే కాకుండా దొడ్డిపట్ల ఏటిగట్టు దిగువన ఉన్న 212 మత్స్యకార కుటుంబాలకు దొడ్డిపట్ల హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి మూడు పూటలు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేసారు.

వేగంగా స్పందించిన అధికార యంత్రాంగం

వరద తీసిన వెంటనే పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారందరికీ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ 212 మందిలో ఎనిమిది మంది సింగిల్ డిజిట్ రేషన్ కార్డు కావడంతో ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున ఎనిమిది వేలు, మిగిలిన 208 కుటుంబాలకు కుటుంబానికి రూ.2 వేలు చప్పున రూ.4.08 లక్షలు వెరసి మొత్తం రూ. 4.16 లక్షలు వరద తీసిన మరుసటి రోజునే వరద బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

పాడి పశువులకు సైతం

పశువులు సైతం ఆకలితో అలమటించకూడదనే ధ్యేయంతో పశుసంవర్థక శాఖ అధికారులు పశువుకు 25 కిలోలు, గొర్రె, మేకకు 5 కిలోలు చప్పున పాడి రైతులకు 25 టన్నుల మిశ్రమ దాణా ప్యాకెట్లను ఉచితంగా అందించారు. కనకాయలంకలో 400 పశువులకు, 500 గొర్రెలకు సంబంధించి 139 మంది రైతులకు 15 టన్నులు దాణా, పెదలంకలో 400 పశువులకు సంబంధించి 52 మంది రైతులకు 10 టన్నులు దాణా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ విధంగా వరద సహాయం వేగంగా అందించడంపై వరద బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇంత త్వరగా ఎప్పుడూ అందలేదు



ప్రతి ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో మా లంక గ్రామాలకు వరదలు రావడం పరిపాటి. వరద వెళ్లిన వారం, 15 రోజులకు కాని ప్రభుత్వ సహాయం అందేది కాదు. కానీ గత మూడేళ్లుగా వరద ఉన్న సమయంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం, వరద వెళ్లిన వెంటనే నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం, ఆర్థిక సహకారం అందించడం పరిపాటిగా మారింది.

– పులి సుబ్రహ్మణ్యం, కనకాయలంక

పశువులకు సైతం పూర్తి స్థాయిలో



వరదల సమయంలో మనుషులకే ఆహారం కష్టం. ఇక మూగజీవాల సంగతి సరే సరి. కానీ గత రెండేళ్లుగా వరద వస్తుంటే పశువులకు ఉచితంగా దాణా అందజేస్తున్నారు. మాకు ఆవులు, గేదెలు కలిపి 12 పశువులు ఉన్నాయి. ఒక్కో పశువుకు 25 కిలోల మిశ్రమ దాణా అందజేశారు. వరద వల్ల పచ్చగడ్డి బీడులు మట్టితో కప్పపడిపోతాయి. ఈ సమయంలో ప్రభుత్వం పంపిణీ చేసిన దాణా వలన పాల దిగుబడి తగ్గలేదు.

– చేగొండి రామకృష్ణ, పెదలంక

ప్రభుత్వం ఫ్రీ హ్యాండ్ ఇచ్చింది



ప్రభుత్వం ఫ్రీ హాండ్ ఇవ్వడం వల్లే వరద సహాయక చర్యలు సకాలంలో తీసుకోగలిగాం. వరద ఉన్న 12 రోజులు కనకాయలంక కాజ్‌వే మీద ఇంజిన్ పడవలు నడిపామన్నా, వరద ఉండగానే నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నా, వరద తీసిన వెంటనే ఆర్థిక సహకారం అందించామన్నా అంతా ప్రభుత్వం మాకు కల్పించిన వెసులుబాటే కారణం. కలెక్టర్ ప్రశాంతి కూడా డబ్బులు కోసం చూడకుండా సహాయం చేయమని ఆదేశాలివ్వడంతో సహాయక చర్యలు వేగంగా చేయగలిగాం.

– మాతా సునీల్‌కుమార్, తహసీల్దార్, యలమంచిలి

జిల్లాలో మూడు స్టేషన్ల ఎంపిక మంచి తరుణం

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం అమృత్ భారత్ రైల్వే స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అమృత్ భారత్‌లో పశ్చిమ గోదావరి దేశంలోని రికార్డుగా నిలిచిందని, మరెక్కడే లేని విధంగా జిల్లాలో ఈ పథకం కింద మూడు రైల్వే స్టేషన్లు ఎంపికి కావడం మంచి తరుణని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన అమృత్ భారత్ కార్యక్రమంలో మంజూరు చేసిన నిధులతో చేపట్టే పనులకు ప్రధానిమోదీ ఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేస్తున్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాదరాజు మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్లుగా రాష్ట్రంలో మొత్తం 18 స్టేషన్లు ఎంపిక కాగా అందులో పశ్చిమలో మూడు స్టేషన్లు ఉండటం విశేషమన్నారు. ఈ పథకం కింత జిల్లాలోని స్టేషన్లకు సుమారు రూ.73.05 కోట్లతో అభివృద్ధి పనులకు కేటాయించగా వీటిలో నరసాపురం స్టేషన్‌ను రూ.25.7 కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టనున్నార న్నారు. అలాగే తాడేపల్లిగుడెం స్టేషన్‌కు రూ.27.13 కోట్లు, భీమవరం స్టేషన్‌కు రూ.22.13కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. భారత దేశ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 508 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులను ప్రధానిమోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయగా వీటిలో రాష్ట్రంలో 18 రైల్వే స్టేషన్‌లలో సుమారు రూ.454కోట్లతో పునరాభివృద్ధి పనులకు నాంది పలికారన్నారు. నరసాపురంలో రైల్వే స్టేషన్, బస్టాండ్ల అభివృద్ధి, కొత్త సర్వీసుల పునరుద్ధరణలతో నరసాపురం నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మార్గం సులభతరం అవుతుందని ఆయన అన్నారు.

త్వరలోనే వారధి పనులు

కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలను కలుపుతూ వశిష్ట వారధి పంతెన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన అన్నారు. గతంలో రైల్వేశాఖ మంత్రి నరసాపురం వచ్చినప్పుడు పలు రైలు సర్వీసులు పునరుద్ధరణ చేయాలని రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలని ప్రత్యక్షంగా పరోక్షంగా కోరడంతో ఈ రోజు ఈ కార్యక్రమం ద్వారా నరసాపురం స్టేషన్ అభివృద్ధికి అడుగులు అత్యాధునిక వసతులతో రూపురేఖలు మారబోతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీను, రైల్వే అడ్వైజరీ కమిటీ బోర్డు సభ్యులు జక్కంపూడి కుమార్ (విజయవాడ), మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, రైల్వేశాఖ అధికారులు డీసీఎం మహమ్మద్ ఆలీఖాన్, ఏడీఎం ఏఎస్ రామంజనేయులు, ఎస్ఆర్ఎం దివాకర్, ఎస్ఎస్ఈలు బి.శివప్రసాదరావు, జాన్ విజయ్, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న కాలనీ రహదారి నిర్మాణం



నౌడు పుంత జగనన్న కాలనీ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం



పెనుగొండ మసీదు వద్ద రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

పెనుగొండ: పెనుగొండ నౌడు పుంతలోని జగనన్న కాలనీ రహదారి నిర్మాణ పనులుచురుగ్గా కొనసాగుతున్నాయి. రహదారి సౌకర్యం కోసం లబ్ధిదారులు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు విన్నవించుకోవడంతో రహదారి నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షం కురవడంతో కొంత మేర ఇబ్బందులు పడడంతో రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వారం రోజులుగా వర్షాలు నిలిచిపోవడంతో తిరిగి నిర్మాణ పనులు పునః ప్రారంభించారు. వేగంగా పూడిక పనులు నిర్వహిస్తున్నారు. పుంత రహదారిని విస్తరింప చేసి, అప్రోచ్‌మెంట్ సైతం ఆదివారం పూర్తి చేసారు. దీంతో రహదారి విస్తరణ పూర్తి చేసారు. త్వరలోనే రహదారి నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

మసీదు రహదారి నిర్మాణం పూర్తి

పెనుగొండ మసీదు వద్ద ముస్లిం శ్మశాన వాటిక వద్ద రహదారి నిర్మాణం పూర్తి చేశారు. గత కొంత కాలంగా రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో రహదారి నిర్మాణం చేపట్టాలని ముస్లింలు కోరడంతో రహదారి నిర్మాణం పూర్తి చేశారు. రహదారి పనులను ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద) ప్రారంభించగా, ఎంపీటీసీ తాడి సుబ్బిరెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పుంగనూరు అల్లర్లకు చంద్రబాబే కారకుడు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: చిత్తూరు జిల్లా పుంగనూరులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపైనా, పోలీసులపైనా దాడిచేసిన ఘటనలో ఏ1 ముద్దాయి చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరు పర్యటన లేనప్పటికీ చంద్రబాబు కేవలం టీడీపీ కార్యకర్తలతో అల్లర్లు సృష్టించి పోలీసులపైనా, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపైనా పక్కా వ్యూహంతో దాడులకు పాల్పడ్డారని అన్నారు. 2024లో టీడీపీ అధికారంలోకి రావడం కష్టమని తేలిపోవడంతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు చంద్రబాబు, టీడీపీ నాయకులు బరితెగించారని దుయ్యబట్టారు. పోలీసులను దుర్భాషలాడి విధి నిర్వహణలో ఉన్న 40 మంది పోలీసులను గాయపరిచారన్నారు. బెంగుళూరు, చెన్నైల నుంచి టీడీపీ నాయకులు గూండాలను రప్పించారన్నారు. ప్రజాస్వామ్య విధానంలో ప్రజల మద్దతుతో గెలిచిన మంత్రులను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పత్రికలో రాయడానికి వీలులేని పదజాలంతో దూషించడం సిగ్గుచేటన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మూడు సార్లు ముఖ్యమంత్రి చేసిన చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరు, అతని నోటి వెంట వస్తున్న పదజాలం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కేవలం వారి ఉనికిని చాటుకోవడానికి తాపత్రయపడుతున్నారని విమర్శించారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రజల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. పుంగనూరు అల్లర్లుకి బాధ్యులైన చంద్రబాబుని ఏ1 ముద్దాయిగాను, మిగిలిన టీడీపీ నేతలందరిపైనా పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వర్లు, నంబూరు శ్రీగంగా పవన్, మోర్త గిరీష్, బండి రమేష్, కోట రత్నరాజు, కెల్లా పెద్దిరాజు, వెలివెల సర్పంచ్ కెల్లా సింహాచలం, తాతపూడి శర్మ, ఈద మధు, నక్కా చిత్తరంజన్, గేదెల నరసింహారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లి 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, 11కేవీ శివదేవునిచిక్కాల ఫీడర్‌లో సాంకేతిక మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భగ్గేశ్వరం, చింతపర్రు, చందపర్రు, ఆగర్రు, సత్యనారాయణపురం, చిట్టివానిగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెంచీల ఏర్పాటు అభినందనీయం

పాలకొల్లు సెంట్రల్: సేవ కార్యక్రమాలు చేయడంలో యునైటెడ్ కాపు క్లబ్‌తో పోటీగా కాపు వనిత క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాలు అందించడం అభినందనీయమని క్లబ్ గవర్నర్ ముచ్చర్ల సంజయ్ అన్నారు. ఆదివారం వనిత క్లబ్ సభ్యులు పట్టణంలో రైల్వేస్టేషన్, గాంధీబొమ్మల సెంటర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ప్రయాణికులు సేద తీరేందుకు బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు మంగెన అరుణ, సెక్రటరీ యామన విజయలక్ష్మి, చీడే శిరీష, కర్రె రేవతి, యర్రంశెట్టి అనూష, కాపు క్లబ్ అధ్యక్షులు గాది ఆంజనేయులు, పశ్యావుల రవి, జక్కంపూడి మధన్, మంగిన సాయి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

భీమవరం అర్బన్: మండలంలోని ఎల్‌వీఎన్ పురం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు ఆదివారం సర్పంచ్ కేతా నాగబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సమస్యను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో వీరవల్లి శ్రీనివాస్, పెచ్చెట్టి పవన్‌కుమార్, కుడిపూడి సత్యనారాయణ, బొంతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల బైక్‌ర్యాలీ

సాక్షి, భీమవరం: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. కిల్లరి మల్లేశ్వరరావు, నీలపు శ్రీను, బంగారు శివ పాల్గొన్నారు.

నేడు రైతుల ధర్నాను విజయవంతం చేయాలి

తణుకు: రైతులు, కౌలు రైతులకు ప్రతి ఎకరాకు సాగు పెట్టుబడిగా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన రైతుల ధర్నా విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. ఆదివారం తణుకు సురాజ్యభవన్‌లో రైతుల ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వ్యవసాయ సాగుపెట్టుబడి వ్యయం బాగా పెరిగి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, నెక్కంటి క్రాంతి కుమార్, సికిలే పుష్పకుమారి, టి.అప్పలస్వామి, జిల్లా సమితి నాయకులు నామన వెంకటేశ్వరరావు, మండల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకువాడకు ఆధ్యాత్మిక శోభ

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ కొండవేటి సాంబశివరావు తెలిపారు. గ్రామంలో రూ.1.50 కోట్ల అంచనాలతో చేపట్టిన చెన్నుమల్లేశ్వరస్వామి, వేణుగోపాల స్వామివార్ల ఆలయాల నిర్మాణ పనులను సర్పంచ్, గ్రామ పెద్దలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరుకువాడ నడిబొడ్డులో నిర్మితమవుతున్న ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పెద్దలు, దాతలు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామానికే తలమానికంగా ఈ ఆలయాలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వ సహకారం రూ.కోటి, గ్రామ పెద్దలు, ప్రజలు, దాతల సహకారంతో రూ.50 లక్షలు సమకూరినట్లు చెప్పారు. ప్రస్తుతం చెన్నుమల్లేశ్వరస్వామి ఆలయం శ్లాబ్ పనులు జరుగుతున్నాయని, వేణుగోపాల స్వామివారి ఆలయం పనులు కూడా పూర్తి కావస్తున్నాయని సర్పంచ్ తెలపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నడింపల్లి కృష్ణంరాజు, చింతపల్లి బ్రహ్మరెడ్డి, కొండవేటి సూర్యనారాయణ, సూరగాని రామారావు, ఐతం కృష్ణ, కొండవేటి శ్రీనివాసరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పాఠశాల మెయిన్ గేట్ బోర్డును ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్

భీమవరం అర్బన్: పాఠశాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములై విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్ కోరారు. మండలంలోని యనమదుర్రు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ గేట్ బోర్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ 1924లో మద్దా వెంకరత్నం పాఠశాలకు స్థలాన్ని దానం చేశారని, వచ్చే ఏడాదితో ఈ పాఠశాల నిర్మించి 100 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా వేల కోట్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపి ఉన్నతులుగా తీర్చి దిద్దాలన్నారు. సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని కలిగి ఉండాలని, సచివాలయంలో మద్దా వెంకటరత్నం విగ్రహంతో పాటు స్వాతంత్రోద్యమ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, ఎంపీటీసీ సభ్యుడు దగాని ఆశీర్వాదం, దేవస్థానం చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ, మద్దాల తేజ, మెల్లా రాంబాబు, బాలాజీ, చందు నాని, శివనేపల్లి అచ్యుతరామ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జాబ్ డ్రైవ్

సాక్షి, భీమవరం: నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన నర్సాపురం వైఎస్ డిగ్రీ కళాశాల, 9న భీమవరం డీఎన్నార్ డిగ్రీ కళాశాలల్లో ఈ జాబ్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ డ్రైవ్‌నందు కస్టమర్ సపోర్ట్, బీపీఓ వాయిస్ ప్రాసెస్ వంటి ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఏదైనా డిగ్రీ చదివిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి: నలుగురిలో అవమానం జరిగిందనే బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన పాచిపెంట సురేష్(27) అనే వ్యక్తి ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు తన స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా కేక్ కొనేందుకు ఉండి సెంటర్‌లోని హరిప్రియ బేకరీలో వెళ్లాడు. అదే షాపులో తనకు తెలిసిన భవనీ అనే యువతి అక్కడ ఉండటం చూసి ఆమె తలపై చేతులు వేసి నిమిరాడు. దీనిపై సదరు యువతి తన కాలిచెప్పు తీసి అతని రెండు చెంపలపై కొట్టింది. ఆ తరువాత సురేష్ ఇంటికి వెళ్లిన ఆమె అతని భార్యను కూడా కొట్టింది. నలుగురిలో కొట్టడంతో అవమానంగా భావించిన సురేష్ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబికులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు, అనంతరం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం 6 గంటలకు మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారంతో పాటు మృతుని భార్య పాచిపెంట సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు.